క్లుప్తంగా

అవంతిలో రెడ్‌క్రాస్ యూనిట్ ప్రారంభం



రెడ్‌క్రాస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న రవికుమార్ తదితరులు

మాకవరపాలెం: అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ కళాశాలలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ విశాఖపట్నం సెక్రటరీ రవికుమార్, జిల్లా సమన్వయకర్త రహ్మతుల్లా మాట్లాడుతూ యువత రక్తదానం చేస్తూ ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో యువత స్వచ్ఛందంగా పాల్గొని సమాజ సేవలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు' విజయవంతం చేయాలి


గణేష్‌ను సత్కరిస్తున్న విద్యార్థి విభాగం అధ్యక్షులు

నర్సీపట్నం: ఈ నెల 12న జరగనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నూతనంగా ఎంపికైన విద్యార్థి విభాగం నేతలంతా శనివారం ఉమాశంకర్‌గణేష్‌ను ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, నాలుగు మండలాల అధ్యక్షులు జి.సోమన్నదొర, ఎం.అప్పలనాయుడు, ఎం.నాగేంద్ర, ఆర్.వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దారాలమ్మ తల్లి పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీదారాలమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రం నుంచి వల్సంపేట వెళ్లే మార్గంలో తాండవ కాలువ ఒడ్డున ఉన్న శ్రీదారాలమ్మ తల్లిని దర్శించుకునేందుకు నాతవరం, వల్సంపేట, చమ్మచింత గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్ ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలచే భజనలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

క్వారీ లారీ ఢీకొని సింహద్వారం ధ్వంసం


బుచ్చంపేట నుంచి రోలుగుంట వెళ్లే రహదారిలో ధ్వంసం అయిన సింహద్వారం

రోలుగుంట: రోలుగుంట నుంచి బుచ్చంపేట వెళ్లే రహదారిలో గల సింహద్వారాన్ని క్వారీ లారీ ఢీకొన్న ఘటనలో సింహద్వారం ధ్వంసం అయింది. గోపన్న చౌదరికి చెందిన ఈ క్వారీ లారీని గ్రామస్తులు ఆపి డ్రైవర్‌ను నిలదీశారు. యజమానితో చర్చించారు. ధ్వంసం అయిన సింహద్వారాన్ని పునర్నిర్మిస్తామని యజమాని హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు.

మారేపల్లి వేంకటేశ్వర స్వామి కల్యాణం నేడు

దేవరాపల్లి: మారేపల్లి ఉత్తర వాహిని శారదా నది తీరాన పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం, తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహిళలు.. మహారాణులు


సమిధ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఏఎస్‌ఐ యర్రయ్య


నాతవరం వెలుగు కార్యాలయంలో మహిళను సత్కరిస్తున్న అతిథులు


బూరుగుపాలెంలో సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

చిత్తశుద్ధికి.. అంకితభావానికి ప్రతీకలు మహిళలు. ఇంటా బయటా ఒకేలా శ్రమిస్తూ తమపై ఆధారపడిన వారికి వెలుగు బాట చూపగల నేర్పు.. ఓర్పు వారి సొంతం. ఎంతటి కష్టాన్ని అయినా పంటి బిగువన ఓర్చుకుంటూ చిరునవ్వుతో సేదదీర్చే ధీరోదాత్త మహిళకు ఈ మహిళా దినోత్సవాన పలుకుదాం శతకోటి వందనాలు..






మాడుగుల మండల పరిషత్‌లో సత్కారం పొందిన మహిళలతో ఎంపీపీ రాజారామ్ తదితరులు


మాడుగులలో సత్కారం పొందిన మహిళా ప్రజా ప్రతినిధులు


కె.కోటపాడులో మాట్లాడుతున్న పీవో మంగతాయారు


నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో సన్మానం పొందిన మహిళలతో డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు


నర్సీపట్నం మెప్మా కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు నమూనా చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


కె.జె.పురం అంగన్‌వాడీ కార్యకర్త చంద్రను సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

నర్సీపట్నం: ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో డీఎస్పీ శ్రీనివాసరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ పాల్గొని వంద మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పీఆర్టీయూ మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు ఎల్.సుగుణ, జిల్లా కార్యదర్శి నాగజ్యోతి, డివిజనల్ కార్యదర్శి భారతి, నర్సీపట్నం మండల మహిళా ప్రతినిధులు జె.మంగతల్లి, ఆర్.సునీత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో..

డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో విద్యార్థినులు, పోలీసులు పాల్గొన్నారు. కృష్ణాబజార్, అబిద్‌సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐ గోవిందరావు, ఎస్సైలు రమేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. మెప్మా కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి బెస్ట్ ఆర్పీలు సత్యవతి, వరలక్ష్మి, ఉమాదేవి, లోవరత్నం, లలిత, పద్మజ, రేవతి, కనక సత్యకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం 470 మంది మహిళలకు బ్యాంకు లింకేజీ రుణం కింద రూ.5.82 కోట్ల నమూనా చెక్కు అందజేశారు. కౌన్సిలర్ సీహెచ్ పద్మావతి, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కోఆర్డినేటర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రామచంద్ర, ఏఎస్‌ఐ యర్రయ్య న్యూట్రిషన్స్ ప్రాజెక్టులు తయారు చేసిన మహిళలకు బహుమతులు అందజేశారు.

మహిళా విద్యతోనే సమాజాభివృద్ధి..

మాడుగుల: స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ పాల్గొన్నారు. ప్రతి మహిళ ఉన్నత విద్య అభ్యసించిన నాడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళా ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్‌లు ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబర్ షేక్ ఉన్నీషా, గూడెపు సత్యవతి, మాధవి, శ్రీనాథు సూర్యకాంతం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఐసీడీఎస్ ఉద్యోగులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో..

కె.కోటపాడు: ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవంలో ప్రాజెక్ట్ అధికారి మంగతాయారు పాల్గొన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, మండల ఇంజినీర్ సుమతి, వెలుగు ఏపీఎం చినబాబు, సీసీలు వెంకటరావు, సన్యాసిరావు, సింహాచలంనాయుడు, సురేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మహిళా దినోత్సవం..

చోడవరం: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి ఎస్‌వీ మధు ప్రేమ సమాజంలో విశ్వశాంతి మహిళా మ్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు, ఆర్కే ప్రసాద్, ప్రేమసమాజం మేనేజర్ ప్రసాద్‌రాజు, మ్యాక్స్ అధ్యక్షురాలు కోరుకొండ లక్ష్మి, ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సుప్రజ, సీపీఐ డివిజన్ కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసు పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలన్నారు. వైస్ ఎంపీపీ బైన కుమారి, పంచాయతీ విస్తరణాధికారి చైతన్య, సూపరింటెండెంట్ అమ్మాజీ పాల్గొన్నారు. లక్కవరం, వెంకన్నపాలెం సచివాలయాల్లో జరిగిన వేడుకల్లో మహిళా సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను ఘనంగా సత్కరించారు. కార్యదర్శి గంగాధర్, సర్పంచ్‌లు శీరంరెడ్డి వెంకటరమణ, మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు మహిళలకు సత్కారం..

నాతవరం: మండలంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో వెలుగు కోఆర్డినేటర్ కె. సత్యనారాయణ పాల్గొని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కనకరాజు, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రావికమతం వెలుగు కార్యాలయంలో..

రావికమతం: వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే రాజు పాల్గొన్నారు. మండలంలో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. కొత్తకోట సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రావికమతం, కొత్తకోట గ్రామాల్లో ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో వెంకన్నబాబు, మండల పరిషత్ ఏవో సీతారామస్వామి, తెదేపా అధ్యక్షుడు రాజాన కొండనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో..

దేవరాపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి పాల్గొన్నారు. తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, అదనపు ఎస్‌ఐ ఎం.రాములమ్మ, వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి డి. వనజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉద్యోగులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు, పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్ నివాసంలో..

నర్సీపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉమాశంకర్‌గణేష్ సతీమణి కళావతిని మున్సిపాలిటీలోని వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బైపురెడ్డి గణమ్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు కనితి అన్నపూర్ణ, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, లోకవరపు శారద, గంటా లలిత పాల్గొన్నారు.

బైలపూడిలో..

చీడికాడ: బైలపూడితో పాటు చీడికాడ పవర్‌లూమ్ ఇండస్ట్రీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి పాల్గొన్నారు. సర్పంచ్ గంగతల్లితో పాటు మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపాలెం సచివాలయంలో..

మాకవరపాలెం: బూరుగుపాలెం సచివాలయంలో సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ సచివాలయ మహిళా ఉద్యోగులు, వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్, గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో..

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో 33 సంవత్సరాలుగా అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్న పి. చంద్రను కె.జె.పురం సచివాలయంలో ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సత్కరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, స్థానిక కూటమి నాయకుడు కాళ్ల హరిబాల తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురం సబ్ పోస్టాఫీసులో..

కె.జె.పురం సబ్ పోస్టాఫీసులో పోస్టు మాస్టర్ కె. సుధీర్ మహిళా బ్రాంచి పోస్టుమాస్టర్లు, సహాయ బ్రాంచి పోస్టుమాస్టర్లు, మహిళా ఏజెంట్లను సత్కరించారు. బ్రాంచి పోస్టుమాస్టర్లు, సిబ్బంది పి. రాంజీ తదితరులు పాల్గొన్నారు.


కె.జె.పురం పోస్టాఫీసులో సత్కారం పొందిన మహిళా బ్రాంచి పోస్టుమాస్టర్లు, ఏజెంట్లతో బీపీఎం సుధీర్


దేవరాపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎస్‌ఐ రాములమ్మ తదితరులు


రావికమతంలో మహిళలను సత్కరిస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు


బైలపూడిలో సత్కారం పొందిన మహిళలతో ఎంపీపీ జయమ్మ తదితరులు


నర్సీపట్నంలో కళావతిని సత్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, మహిళా నేతలు

హామీలు అమలు చేయాలని ఆందోళన

మాడుగుల రూరల్: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని మండల సీపీఎం కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకరం గ్రామంలో మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ. 1500, ప్రతి మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని, మద్యం షాపులు, బెల్టు షాపులు గ్రామాల్లో ఎక్కువగా ఉండటం వల్ల మహిళలు, బాలికల మీద లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి దేవుడమ్మ, సోలం దేముడమ్మ, కాసిన ఎర్రయ్యమ్మ, సోలం చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నర్సింహమూర్తి, మహిళలు

సామాజిక తనిఖీలు ప్రారంభం

మాడుగుల రూరల్: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల సామాజిక తనిఖీలు గ్రామాల్లో ప్రారంభించారని స్థానిక ఉపాధి హామీ పథకం ఏపీవో జె. మురళీకృష్ణ శనివారం తెలిపారు. మండలంలో 29 గ్రామ పంచాయతీల పరిధిలో గల 104 గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1వ తేది నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన రూ. 17 కోట్ల 29 లక్షల విలువైన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం సభ్యులు జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ ఇంటికి వెళ్లి తనిఖీ చేస్తారన్నారు. తర్వాత సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారుల సారథ్యంలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా రామ సత్యసాయి ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు: కూండ్రపువానిపాలెంలోని రామసత్యసాయి ఆలయ 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మండల సత్యసాయి భజన మండళ్ల ఇన్‌చార్జి కన్నూరు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యసాయి సేవా సహ సమన్వయకర్త రాఘవరావు మాట్లాడుతు సత్యసాయి చూపిన సేవా మార్గంలో భక్తులు పయనించాలని సూచించారు. భక్తులకు కన్నూరు సూర్యనారాయణ అన్నసమారాధన నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, దార్ల గురన్నాచారి, బండారు నారాయణపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.


భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాఘవరావు

నేడు మోదకొండమ్మ పండగ

బుచ్చెయ్యపేట: మండలంలో గల విజయరామరాజుపేట గ్రామ దేవత మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి పండగ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందేలు ఏర్పాటు చేశామని, గెలిపొందిన విజేతలకు వరుసగా రూ. 12,8,5,4,3 వేల నగదును గ్రామ పెద్దలు, కమిటీ సభ్యుల చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారి సంబరంలో పాల్గొనాలని, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.


మోదకొండమ్మ అమ్మవారు

నూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నేడు

దేవరాపల్లి: స్థానిక ఎరుకుల పేటలో శ్రీనూకాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

18లోగా పీ-4 సర్వే పూర్తి చేయాలి

కె.కోటపాడు: ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న పీ–4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్‌నర్‌షిప్) సర్వేను ఈ నెల 18లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎ.ఎ.సాంబశివరావు తెలిపారు. చంద్రయ్యపేటలో శనివారం నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. మండలంలో గల 32 గ్రామ పంచాయతీల్లో బీపీఎల్ కుటుంబాలను కలిసి సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సర్వేను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

కె.కోటపాడు: చింతపాలెం గ్రామస్తులు శనివారం ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిపారు. ఉదయం నుండి స్వామికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ఉపాధి పనులు కల్పించాలని పాదయాత్ర

రావికమతం: గిరిజనులు, సీపీఎం నాయకులు కొండ శిఖర గ్రామాలకు ఉపాధి పనులు కల్పించాలని ప్రజా చైతన్య యాత్ర పేరిట పాదయాత్ర నిర్వహించారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ నేరేడు బంధ నుంచి బంగారు బందల గ్రామం వరకు యాత్ర కొనసాగింది. చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడుబంధ, జీలుగులోవ, సోంపురం, బంగారు బందలు గ్రామాల్లో 30 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరికి నేటికీ వారి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించలేదని, తక్షణమే అందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్‌జీఎస్ పీడీని గ్రామంలో పనులు కల్పించాలని కోరగా అలా చేయడం సాధ్యం కాదని, కిందకొచ్చి పని చేస్తే ప్రయాణ చార్జీలు ఇస్తామని చెబుతున్నారని గిరిజనులు తెలిపారు. అలా చేయాలంటే రాను పోను 8 కిలోమీటర్లు దూరం నడవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, అప్పారావు, కామేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు జరిగే ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. వీటికి సంబంధించిన పోస్టర్లను వర్తక సంఘం కమిటీ నాయకులు దాడి సూరినాగేశ్వరరావు, దొండా నారాయణమూర్తి, దొండా గిరిబాబు, దొండా నరేష్, దొండా రమేష్, సయ్యపురెడ్డి శ్రీను, బత్తుల రామకృష్ణ, మంచాల గోవింద, సయ్యపురెడ్డి వీరభద్రం, తలారి శంకర్రావు, గరికిపాటి మేఘరావు ఆవిష్కరించారు.

డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ

రావికమతం: మండలంలో టి.అర్జాపురం పంచాయతీ శివారు చిలకవానిపాలెంలో డ్రైన్ నిర్మిస్తున్నట్లు రావికమతం మండల వైస్ ఎంపీపీ మత్సా భవానీ ప్రసాద్ తెలిపారు. అందుకు సంబంధించి భూమి పూజ శనివారం జరిపారు. రూ. 5 లక్షల మండల పరిషత్ నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఫాల్గుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌నాయుడు, రాజాన రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజలో పాల్గొన్న సర్పంచ్ ఫాల్గుణ తదితరులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామానికి చెందిన పుట్టా వరలక్ష్మి, ఎండపల్లి చిన ఆచారి తదితర 28 మందికి రూ. 31 లక్షల విలువైన చెక్కులను శనివారం చోడవరంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి క్యాంపు కార్యాలయంలో అందజేసినట్లు ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

గీత కార్మికులకు మూడు మద్యం షాపులు

మాడుగుల రూరల్: గీత కార్మికులకు లాటరీ ద్వారా మూడు మద్యం షాపులు కేటాయించారని మాడుగుల ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు శనివారం తెలిపారు. మాడుగుల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మాడుగుల, చీడికాడ, రావికమతం, మండలాలకు మూడు షాపులు దక్కాయన్నారు. ఈ నెల 6వ తేదీన అనకాపల్లిలో లాటరీ నిర్వహించినట్లు తెలిపారు.